# అందని క్రీనీడలు

రచన:
"ప్రియబాంధవి"

"నీకు పెళ్ళెపుడయ్యా .... పిలకరాజా....?" అనే కూనిరాగంతో చిన్న 'విసిల్'కూడ మిళాయిస్తూ ప్రవేశించాడు మా 'గోల్డుస్మిత్'

"ఇంకెన్నిసార్లు పెళ్ళాడమంటావు? ఇప్పుడున్న శక్తిస్వరూపిణి చాలకా! గవర్నమెంటు ఇన్ని 'ఎలవెన్సులు' పెట్టిందికాని 'వైఫ్ ఎలవెన్సులూ' బెటీ ఎలవెన్సులూ మంజూరు చెయ్యలేదుకదా!....నేనే మినిష్టరునయితే.... బడ్జెట్ నా చేతికే కనుక వస్తే .... ప్రాజెక్టుల సంగతి అటుంచి ముందు వీటికే 'ప్రొవిషన్' కల్పించేవాణ్ణి!" అన్నాను.

"భలే....కాని—మనకి తెల్లటోపీ లేదుగా! అధమం చిన్న బ్లాక్‌మార్కెట్టయినా చేస్తేగదా! ఇంతకీ అసలు సంగతి మరచాను" అని మా వాడు అంటూంటే—

"అవునవును, ఏమిటో మహా హుషారుగా వచ్చావు....ఎవర్తైనా కలలో ఆహ్వానించిందా? లేక వస్తున్నదారిలో ఏ సుకుమారైనా నీ చెంపలకు అరుణారుణరేఖలు తీర్చి దిద్దిందా?" అన్నాను మా 'గోల్డుస్మిత్'తో.

మా బృందం అంతా ఫకాల్న నవ్వేరు.

"అదేదీకాదు-నీకే వచ్చింది ఎసరు. సుజాత లేదూ?....ఆమెకు అకస్మాత్తుగా చిత్రలేఖనం మీద మోజు పుట్టింది" అని మావాడు పూర్తి చేయకుండానే—

"సరే....సరే....నన్ను చెప్పనీ....అంతలో ఆమె మనఃపథంలో మన 'రాజా' మెదిలి నీకెందుకు....నేనుండగా—ఆభారం నాకు వదిలేయి అన్నాడు అంతేనా?" అంటూ మాత్రికా లజ్జుడైన 'భవభూతి' మా వాడి మాటలు పూర్తిచేసాడు.

"అంతేరా భవభూతి .... నీది మహా గట్టి బుర్ర!" అన్నాడు మా గోల్డుస్మిత్.

ఇక్కడ చిన్నసంగతి చెప్పాలి. నాపేరులో 'శాస్త్రి' అన్నది ఉండటంవల్ల, మావాళ్లు నాకు పిలక ఉండితీరాలని ఊహించేరో ఏమో! అది నాకు తగిలిచ్చి (పేరుకి సుమండీ!) కొనని తీవిగా 'రాజ' శబ్దంతో నాపేరు పూర్తిచేసారు 'ఇదం బ్రాహ్మ్యమిదం క్షాత్రం' అన్నట్లు.

ఇక మా గోల్డుస్మిత్‌సంగతి. వీడికి రంగురంగుల బట్టలుకట్టుకొని సీతాకోకచిలుకలాగ తిరగడమన్నా 'ఫ్లూటు' వాయించడమన్నా మహా సరదా. వాడి 'వంగేళీ' జీవితాన్నిబట్టి వాడి దుస్తుల ధారణనిబట్టి ఆ నామధేయం బహూకరించేం కాని వాడి బుర్రలోవున్న 'మెటీరియల్'నిబట్టి మాత్రం కాదు. వాడి తలపై మ్రోగిస్తే త....ధి....గి....ణ....తోం.... మద్దెలమ్రోతలు విన్పిస్తాయి! కాని వాడిబొంద కవిత్వ మేం తెలుసు వాడికి?

ఇంతలో "ఏం రాజా? నేను తెచ్చింది భలే వార్తకదూ?" అన్నాడు మా గోల్డుస్మిత్.

"ఆ....భలేవార్తే....మా శూర్పణకకి తెలిస్తే మనమే ముక్కూచెవులూ ఇన్స్యూరుచేయాల్సి వుంటుంది....ఇంటిదగ్గరెప్పుడైనా ఈ ఊసెత్తావా....? వెంటనే అంతపనీ చేస్తుంది."

"అంతేనంటావా?....కానీ .... సుజాతే ఈ విషయం అడగటానికి మీ యింటికివస్తే? అన్నాడు అర్థోక్తిలో.

"అవును, అదీ ఒక పాయింటే, మరేం చెయ్యడం?" అన్నాను.

"బ్రదర్....నాకో మంచి ఐడియా తట్టింది. ముందు ఆలయానికి పదండి" అన్నాడు భవభూతి. వాడు పేరుకి భవభూతే కాని తిండికి మాత్రం ఆషాఢభూతి. వీడికి కాఫీచుక్కైనా పోయించడం తప్పదని మా 'కాఫ్యేశ్వరాలయా'ని'కి వెళ్ళాం. కిల్లీలు నములుతూ బయటకు వస్తుంటే—

"చిటికతియ్యరా రాజా" అన్నాడు మా గోల్డుస్మిత్. వాడికి ఆలోచనలువుట్టే ప్రమాదం గల్గినప్పుడు ఇలాగనడం అలవాటు. నేను ఈ చాన్సు వదులుకోడం యిష్టంలేక వెంటనే నా 'పుడ్‌ఫర్‌థాట్'ని తీసి తియ్యడంతోనే మా ఆరువేళ్ళూ ఒకేసారి అందులోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించేయి. "ఆగండ్రా, ఒకరితర్వాత ఒకరంతీస్తే మన 'చిటికెలు' వస్తాయి లేకపోతే మన 'డబ్బీ' నిరశనవ్రతం చేయాల్సివస్తుంది" అన్నాను. ఇందులో మాత్రం మాకు వెంటనే రాజీ కుదుర్తుంది. మా గోల్డుస్మిత్ తర్జనితో మెదడుమీద వాయిస్తున్నాడు.

"వచ్చింది....వచ్చింది" అన్నాడు.

"ఏమిట్రా?" అని యిద్దరమూ ఆత్రంగా అడిగేం.

"మ్చ్....పోయిం....ది. మళ్లీ ఇంకొకటి ఆలోచించాలి" అన్నాడు.

"ఏడిసినట్టుంది .... నీబుర్ర మద్దెలమ్రోతలకి 'సౌండు' సృష్టిస్తుంది కాని నీకు ఐడియాలు కూడానా" అన్నాను. మేము ముగ్గురమూ తర్జనభర్జనలుచేసుకుంటూ ఎన్నో ఐడియాలు వేసాం కాని, ప్రతీ ఐడియాకీ ఏ ఐవో తసమో లోపించేది. చీకటిపడ్డంవల్ల ఎవరిళ్లకి వాళ్లం చేరుకున్నాము.

మర్నాడు శనివారం కావటంవల్ల మధ్యాహ్నము ఒంటిగంటన్నరకే ఆఫీసువదిలి నేనూ మా భవభూతీ కలసి ఇంటిదారిపట్టేం.

"ఒరే? సరస్వతీ వాక్యాన్ని వమ్ముచేస్తావా? 'కవిర్దండి....కవిర్దండి, భవభూతిః పండితః' అని ఆహాటకగర్భురాణి నోటంట పల్కించినవాడివికదా! ఈమాత్రం చిన్నవిషయంలో నీ తలకి ఏ ఐడియా తోచలేదా?" అని మళ్ళా నాలిక కొరుక్కున్నాను (ఎక్కడవీడు ఆలయానికి త్రోవచూపుతాడో నని). ఒక 'చిటిక'తో మాత్రం సంతృప్తిపడ్డాడు.

"ఆలోచించాలి .... ఆలోచించాలి .... కాస్త ఘట్టిగానే ఆలోచించి, సాయంత్రం మన సమావేశంలో ఈ పాయింటు 'ఇంట్రడ్యూస్' చేసి 'యునానిమస్ రిసల్యూషన్' పాస్ చేయాలి. అదుగో మీ యిల్లు దగ్గరపడ్డది. సాయంత్రం వస్తావుకదూ?" అంటూ వెళ్లిపోయాడు. నేను ఇంట్లోకి వెళ్లి డ్రస్సు విప్పుతూండడం చూసికూడ మా శ్రీమతి యింట్లోకి రాలేదు. కాని వంటింట్లోంచి ధాం....ధాం....లు విన్పిస్తున్నాయి. కొంపతీసి సుజాత ఇవాళ రాలేదుకదా! అనుకుంటూండగా మా శూర్పణక ముఖం చిట్లిస్తూ వచ్చింది.

"మాట్లాడరేం? మీ మౌనం అర్థంకాలేదు. ఇలాగ ఎన్నాళ్లు గడుపుదామని, ఊఁ....నాకామాత్రం తెలియదనుకున్నారా!" అంటూ ఉరమడం మొదలెట్టింది.

"ఏమిటి సంగతి? మేఘాలు రాకుండానే ఉరుములు విన్పిస్తున్నాయ్! ఏదైనా కొత్త 'ఇండెంట్' చెయ్యడానికి ఇది 'ఇంట్రొడక్షన్' కాదు కదా!" అన్నాను. మనసులోమాత్రం సుజాతవిషయమేమోనని భయం ఉండనే వుంది. గుండె టక....టక 72 సార్లు కంటె

ఎక్కువే....72 సార్లేం ఖర్మ ! 7200 సార్లు కూడ కొట్టుకుంటూందేమో!

“అబ్బ! ఏం సంగనాచులు ? పాపం ఏమీ ఎరగరు....అంతా నాటకమే! హుం” అంది.

“ఆసలు సంగతేమిటో చెప్పకూడదూ?” అంటూ లాలిస్తూ అడిగేను ఎందుకైనా మంచి దని.

“అదే .... దానిసంగతే .... ” అంటూంది అర్థోక్తిలో. ఆమె అన్నమాటల్లోని ‘దాని’కివున్న ‘గ్రావిటీ’ని ఊహించుకుంటూ “అంటె?” అని ప్రశ్నించేను. “అదేనండీ....అదే ఆ బలే.... అమ్మాయి....” అని ఆమె అంటూంటే గుండె అగిపోతున్నంత పనైంది.



“....లూ....వచ్చి ఇన్నాళ్లయిందికదా! మా స్నేహితులందరూ ఏనాడో చూసేరు అఖరుకు మన ప్రక్కింటి వనజకూడ ఆమె భర్తతో ఇవాళ ‘ఫస్ట్ షో’కి వెళ్తున్నాదిట! మీరేమో ఏ స్నేహితుల్తోటో ఆఫీసు ఎగగొట్టిఅయినా సరే మేటనీలకివెళ్లిపోతారు లేకపోతే ఇన్నాళ్లవరకూ చూడకుండా ఉంటారూ ? నా దగ్గరమాత్రం ఏమీ ఎరగనట్టు నటిస్తారు! ఏమైనాసరే ఇవాళ ‘ఫస్టషో’కి వెళ్లడం తప్పదు ఏం?” అంది.

“బ్రతుకుజీవుడా” అన్నాను (‘సారీ’ అనుకున్నాను) స్వగతంలో. మరేం ప్రళయం లేదనుకుని తాపీగా వాలుకుర్చీ వేసుకుంటూ “సరేలే భోజనాలుచేసి తాపీగా ‘సెకెండ్‌షో’కి వెళ్దాం. రేపు ప్రొద్దున్న పది గంటలకు లేచినా ఎవళ్ళూ అడిగేవాళ్ళుండరు” అన్నాను. మా శూర్పణక కాదు కాదు ‘సుందరి’ “సరే” నంది. అసలు ఆవిడపేరు ‘సుందరి’ కాని సమయాన్నిబట్టి ఆమెపేరులో మార్పు జరుగుతూంటుంది. ఆవిడ కోపంగా ఉన్నప్పుడు ‘శూర్పణక’ అనుకున్నా (అనను సుమండీ! అలాగే పిలుస్తే ఇంకేమైనా ఉందా!) సరదాగా ఉంటేమాత్రం ‘సుందరీ’ అని ఎంతో ‘ఇది’గా పిలుస్తాను. ఆ సమయంలో ‘నందుడి’పోజు కొట్టే మరింత లాభసాటిగా వుంటుంది కదా అని.

అలాగే వాలుకుర్చీలో జారగిలబడి మగతగావున్నా సుజాతసమస్యే ఆలోచిస్తున్నాను. “శాస్త్రిగారూ” అంటూ వీధివైపునుండి ఒక తీయని కంఠం విన్పించింది. మా ‘సుందరి’ వెళ్ళి తలుపుతీసింది. ఆమె సుజాతతో కలిసి ఇంట్లోకి రావడంచూసి తృళ్లిపడ్డాను. గజేంద్ర మోక్షంలో పద్యం జ్ఞాపకానికొచ్చింది. ఆమెను పలకరించకపోతే బాగుండదని–“ఏమండోయి ఇలాగ వచ్చేరు? నాన్నగారు బాగున్నారా?” అంటూ ఒక చెత్తప్రశ్నవేసాను.

“నాన్నగారు ఆరోగ్యంగానే వున్నారు” అని కొంతసేపైనతర్వాత “మీ ఆర్టు గ్యాలరీ చూపిస్తారా?” అంది.

“ఓ! తప్పకుండా” అంటూ దారితీసేను. ఆమే నేనూ గ్యాలరీలోకి వెళ్లేం. మా శ్రీమతి మాత్రం తనకెందుకన్నట్లు యింట్లోకి వెళ్లిపోయింది. ఆమె నేను రాసిన చిత్రాలు ఎంతో ఉత్సాహంగా చూడసాగింది, కొన్ని చిత్రాలు చూసినవే మళ్లా చూస్తున్నాది. ఆమెకు నేను వాటి వివరాలు చెపుతున్నాను.

“ఏమండీ? ఒక సంగతి అడగనా?” అంది.

“అడగండి దానికేం?” అన్నాను.

“మీకు తీరికవుంటే నాకు కొంచెం చిత్రలేఖనం నేర్పగలరా? మీ చిత్రాలు ఈమధ్య కొన్నిపత్రికలలో చూసేను. మా యింటికి ఎదురుగావున్న పత్రికలలో చూసేవరకూ మీరు చిత్రకారులని నాకు తెలియదు. మీ భార్యతో అంత పరిచయం లేకపోడంవల్ల మీరు ఆఫీసులో ఏదో పనిచేస్తున్నారని తెలుసు. నాకు చిత్రలేఖనం నేర్చుకుందామని ఎంతో ఆసక్తి వుంది” అంటూ ఆగింది. మా శూర్పణక వస్తున్నట్లు గమనించి “అలాగేలెండి” అని సంభాషణ ముగించేను. లోలోపలమాత్రం ఇంకా ఆమెతో మాట్లాడాలనే ఉన్నా. సుజాత మా శ్రీమతితో కొంతసేపు నా చిత్రాలగురించి ప్రశంసించి వెళ్లిపోయింది.

ఆ సాయంత్రమే మా బావమఱది ఊరమని పిడుగులాగ ఊడిపడ్డాడు. ఏవో పలకరింపులయిన తర్వాత మెల్లగా వాడొచ్చిన పని గూర్చి మొదలుపెట్టా “బావా మా చెల్లిని దసరాలకి పంపమని ఉత్తరంవ్రాసినా పంపేవు కావు. వారంరోజులుంది దీపావళి. మా చెల్లెలిని రేపు ప్రొద్దుటె తీసుకెళ్తాను. నీవు శలవు పెట్టి రెండు, మూడు రోజుల్లో రావాలి తప్పదు సుమీ?” అన్నాడు. వాడూ, నేనూ బాల్య స్నేహితులమవడంవల్ల ఆమాత్రం చనువు తీసుకోడంలో తప్పులేదు.

“సరే అలాగే కానీ” అన్నాను. మర్నాడు స్టేషనుకి వాళ్లని దిగబెట్టి ‘ఆలయంలో’ కొంచెం కాఫీ సేవించి, యిల్లు చేరుకుంటూండగా నాకోసం ఎదుర్చుచూస్తూ వీధిగుమ్మంలోనే నిలబడివుంది సుజాత. పరిస్థితులు అనుకూలించేయని సంతోషిస్తూ తాళంతీసి “రండి” అన్నాను. ఆమెతో కలిసి గ్యాలరీలోకివెళ్లాను. నా కళామందిరంలో చిత్రాలు చూస్తుంది. ఆమెకు చిత్రలేఖనంగూర్చి కొంచెం ఉపోద్ఘాతం చెప్పేను. ఆమె రోజూ ఏడు గంటలకు వచ్చి ఎనిమిదిన్నరవరకూ కొంచెం నేర్చుకుని వెళ్లిపోతూండేది. ఒకరోజున ఆమె టేబిలు మీదున్న ఒక ఫైలుతీసి అందులోవున్న కొన్ని ‘స్కెచెస్’ చూస్తున్నాది. “ఏమండీ? ఈ ‘స్కెచెస్’ ఇంత సహజంగా వున్నాయికదా! ఇవి మనుష్యుల్ని చూసి రాశారా?” అంది.

"ఔను, మనుష్యుల్ని 'మాడల్స్'గా వుంచి రాసినవే. నేను ఆర్టుస్కూలులో ఉన్నప్పుడు రాసిన బొమ్మలు" అన్నాను. ఆమె అట్టడుగునవున్న ఒక ఫైలుతీసి దానిమీద దుమ్ము దులిపి చూస్తున్నాది. ఆమె ఏది చూడకూడదనుకున్నానో అదే చూసింది. అందులో అర్ధనగ్నంగానూ, నగ్నంగానూవున్న స్త్రీల వివిధ భంగిమల 'స్కెచెస్' వున్నాయి. అన్నీ ఆమె దీక్షగా చూస్తూ "ఏమండీ ఇవికూడ ఒరిజినల్‌గా స్త్రీలను ఈ భంగిమలలో ఉంచి రాశారా?" అంటూ ఆశ్చర్యంతో అంది. స్త్రీలు నగ్నంగా ఉండటమూ, వారి భంగిమలను నేనుచూసి అలాగ 'స్కెచెస్' వ్రాయటమూ ఆమెను ఆశ్చర్యపరచి ఉండొచ్చు.

"అవును, వాళ్లను ఆ భంగిమల్లో ఉంచి రాసినవే" అన్నాను. ఎనిమిదిన్నర అవటం వల్ల ఆమె వెళ్లిపోయింది. ఆమె రోజూ రావటమూ ఆ స్కెచెస్‌వైపే దీర్ఘంగాచూస్తూ వెళ్లిపోవటమూ రెండు, మూడు రోజులు జరిగింది. నాల్గవనాడు ఆమెవచ్చి ఆ ఫైలే తిరగవేస్తూ నావైపుచూసి 'మాష్టారూ?' అని పిల్చి ఆగిపోయింది. ఈ కొత్త సంబోధన నన్ను ఆశ్చర్యపరచినా ఇది సహజమే అని 'ఆగారేం? అడగండి దానికి సిగ్గెందుకూ?' అన్నాను.

"నన్నుకూడ .... మాడల్‌గా వుంచి ...." అంటూ ఆగిపోయి తలవంచుకుంది.

"అరే! సిగ్గుపడతారేం? అలాగే లెండి", అన్నాను. నాకూ ఆమెను 'మాడల్'గా వుంచి రాద్దామనే ఉబలాటం వుండి. కాని నేర్చుకుందికి వస్తున్నాది కదా అని ఆమెను ఈవిషయంలో ప్రస్తావించడమెలాగని జంకేవాడ్ని. ఇప్పుడు ఆమే తనంతట తానై అడగ్గానే 'కొండంత' సంతోషించేను. "సరే, రేపు వస్తా" అంటూ వెళ్లిపోయింది. ఆ మరునాడు నేను శలవుపెట్టి ఇంట్లోనే ఉండిపోయాను. ఆరోజు ఏడున్నర దాటినా రాలేదేమా! అని వీధివైపు చూసేసరికి ఆమె విద్యుల్లతలాగ ప్రత్యక్షమయింది. చక్కని షిఫాన్‌చీరమీద అతి పల్చటి రవికతొడిగి తలనిండా పువ్వులు తురుముకొని ఆమె కన్పించేసరికి "ముంగాల సింగార ముంగార మేలు బంగారు రంగారు లంగా ధరించి" అన్న 'శ్రవణానందం'లోని పద్యం జ్ఞాపకానికివచ్చి ఉక్కిరిబిక్కిరయేను. 'ఇందుకే కాబోలు! ఇంత ఆలస్యంచేసింది' అనుకున్నాను. ఆమె నా కళామందిరంలో అడుగుపెట్టేసరికి నేను టేబిలుమీద చిందరవందరగావున్న ఫైల్సూ, కాగితాలూ తీసివేసి టేబిలు శుభ్రపరిచేను.

"మీరు దీనిమీద కూర్చోండి" అన్నాను.

"మాష్టారూ? మీరు నన్ను 'అండీ' అని సంబోధించవద్దు 'సుజాతా' అంటే చాలు" అంది. నాకు నవ్వొచ్చింది.

నేను నా క్రేన్‌పెన్సిలూ, స్కెచింగ్‌పేపర్సూ బోర్డు మొదలైన నా సరంజామా అంతా దగ్గర పెట్టుకుని ఆమెకు ఒక 'కార్నర్ వ్యూ' లో కూర్చున్నాను, ఆమె కూర్చొనే భంగిమ సరి చేద్దామని లేచివెళ్లాను.

"మీరు .... సారీ .... నీవు ఆ ఫొటోవంకే చూస్తుండు. ఇటు తల ఇలాగ త్రిప్పాలి ఆ అలాగ" అంటూ ఆమెకు కొంచెం వెనుకగా వెళ్లి 'ఏంగిల్' చూసుకుంటున్నాను. ఆమె తలలో తురుముకున్న మాలతీ కుసుమాలు నాకు మత్తెక్కిస్తున్నాయి. ఆమెకు ఎదురుగా వెళ్లి 'కొంచెం తలపైకెత్తు' అన్నాను. ఈవిధముగా ఆమె భంగిమను సరిచేస్తూంటే ఆమె పైట జారింది. ఆమె తనపైటనరిచేసుకుంటూ తన సోగకళ్లతో నావైపు చూస్తూ—

"ఇలాగేనా కూర్చోటం" అంది.

"కొంచెం భుజాలు ఇలాగ త్రిప్పాలి" అన్నాను. ఆమె ప్రయత్నించింది కాని నేననుకున్నట్లుకాదు. "చూడు సుజాతా ఇంకొంచెం ఇలాగ త్రిప్పు" అంటూ ఆమె భుజాలను సరి చేయాలని ఆమెకు ఇంకా దగ్గరగా వెళ్లాను, ఆ పూల పరిమళం పూర్తిగా మత్తెక్కించింది. ఆమె భుజాలుపట్టుకుని సరిచేస్తుంటే గగుర్పాటు కలిగించింది.

"ఏమండీ" అంటూ ఆమె నావైపే చూస్తున్నది. మెల్లిగా ఆమెభుజాలను నావైపు త్రిప్పుకుని ఒకచేతిని ఆమె నడుంచుట్టూవేసి రెండవ చేత్తో హృదయానికి హత్తుకుంటూ—

"సుజాతా....ఏదీ....ఒక్కసారి నవ్వి....నీ పెదవులు....' అంటూండగా చెంప చుర్రుమంది!....!!....!!! కళ్ళు బైర్లుక్రమ్మాయి.... కొంతసేపటికి మెల్లగా కళ్లువిప్పాను. సుజాత కాదు....సుందరి ప్రక్కనే నిలబడివుంది.

"ఏమిటండీ! మీ నిద్రా మీరూనూ? కల వచ్చిందా ఏమిటి? ఏమిటలా కలవరిస్తున్నారు అస్పష్టంగా?....ఎంత ఇదైనా....అవ్వవ్వ!.... పగటివేళ ఇలాగ నడుంచుట్టూ చెయ్యివేసి! మరీ చిన్నపిల్లలయిపోతున్నారు .... చూడండి ఈ గాభరాలో కాఫీగ్లాసునుకూడ తృళ్లగొట్టేవారే! పాపం వేడికాఫీ ముఖంనిండా ఒంపుకున్నారు....మ్చ్....నాలు గయినా నిద్రేనా?" అంటూ తన పైటచెంగుతో ముఖం తుడిచి కాఫీగ్లాసు అందించి, చిఱునవ్వు ఒలకబోస్తూ వెళ్లిపోయింది. నేను నాచేతిని బుగ్గపై రాసుకున్నాను.

"ఇంతాచేస్తే కలా!! నయమే సుజాతపేరు కలవరించలేదు కదా? కలవరించినా ఆమెకు వినపడివుండదు" అనుకుంటూ కాఫీ గుటుక్కున త్రాగబోయి మళ్లా నాలికకూడ చురుకుతుందని గ్రహించి తాపీగానే త్రాగాను.

ఆ సాయంత్రం మా బృందం సమావేశమయింది. కాని మా గోల్డుస్మిత్‌జాడ ఎక్కడా లేదు. ఇంతలో—

"డిస్‌గ్రేస్‌రా బ్రదర్ డిస్‌గ్రేస్, నేనైతే ఆత్మహత్యచేసుకుందును. అయినా ఈ కాలములో ఈ కాలమేమిటి—ఆనాడే ఏ అనుభవశాలో తననే అన్నాడు 'క్షణ క్షణంబులు జవరాంద్ర చిత్తముల్' అని ఒత్తి ఫికిల్ మైండెడ్‌నెస్" అంటూ ఎవరిమీదో జోరుగా రిమార్కులు పాస్‌చేసేస్తున్నాడు.

"ఏమైందిరా ఇంతకీ? నీ సస్పెన్సూ నువ్వూనూ? చెప్పేదేదో సరిగా చెప్పి ఏడవరాదూ?" అంటూ తగిలేడు మా భవభూతి.

"పోయిందిరాఛాన్సు పోయింది మరి రాదు! అయినా మనకంత అదృష్టం ఉండొద్దూ?' అంటూ తిరిగి అర్ధంలేని వాగుడు ప్రారంభించేడు.

"ఒరేయి గాడిదా? చెప్పేదేదో సరిగా చెప్పు మళ్లీ డొంకతిరుగుడుగా ప్రారంభించేవా?" అంటూ గుడ్లురిమిచూసేడు మా భీమసేనుడు.

"అయితే జాగ్రత్తగా వినండి. మీలో ఎవరికి హార్టుఫెయిలయినా నాపూచీలేదు. సుజాత వెళ్లిపోయింది" అంటూ అర్ధోక్తిలో మా వైపు చూసేడు.

"ఎక్కడికిరా?" అన్నాం ఒక్కసారిగా అందరమూ క్వశ్చెన్‌మార్కు ముఖాలతో.

"బ్రదర్ ఏమీ అనుకోకు పాపం! ముఖ్యముగా తీరని కష్టం వచ్చింది నీకు. ఇవాళే చూసాను. ఆమె అంటే నీ వలపులరాణి స్వప్నసుందరి ఆ సుజాత మన డ్రాయింగ్ మాష్టరులేడూ? వాడే! ఆ పండిన బట్టతలా ఎత్తుపళ్ళూ వాడిదగ్గరకు 'ఆర్టు' నేర్చుకుందికి వెళ్తూన్నాది. ఇంకా ఇవాళే ప్రారంభోత్సవమట!" అంటూ ఆముదం త్రాగిన ముఖంతో నా వైపు చూసాడు.

నా చంపపైకి ఐదువ్రేళ్ళూపోయి ఒక్కసారిగా తడుముకున్నాయి. ★